# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 18 | శుక్రవారం 19, సెప్టెంబర్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com


# నిద్దరోయిన నిఘా నేత్రం!



ఒక్క మాదాపూర్ జోన్‌లోనే 644 కెమెరాలు నో వర్క్

రోడ్ల విస్తరణలో 300 సీసీ టీవీలు మాయం

సరైన నిర్వహణ లేక మిగిలినవీ మొరాయింపు

అక్రమ కేబుళ్ల తొలగింపులో కెమెరాల వైర్లూ కత్తిరింపు

శాంతిభద్రతల నిర్వహణ, నేరాల దర్యాప్తులపై ప్రభావం

**హైదరాబాద్ సెప్టెంబర్ 18(ప్రజాస్వరం):** దొంగలను గుర్తించాలన్నా, దోపిడీ ముఠాల ఆటకట్టించాలన్నా.. ఏమూలలో ఏం జరుగుతోందో తెలుసుకోవాలన్నా సీసీటీవీ కెమెరాల పాత్ర అత్యంత కీలకం. కానీ.. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో సీసీ కెమెరాల నిర్వహణ డొల్లతనంగా మారింది. రోడ్ల విస్తరణ, అక్రమ కేబుల్ వైర్ల తొలగింపు సమయంలో కెమెరాల వైర్లూ తొలగించడం, వార్షిక నిర్వహణ సరిగా లేకపోవడం తదితర కారణాలలో నిఘా నేత్రాలు నిద్దరోయాయి. సైబరాబాద్‌లో అత్యంత కీలకమైన మాదాపూర్ జోన్‌లో ఏకంగా 644 సీసీటీవీ కెమెరాలు పనిచేయడం లేదు.

**రోడ్ల విస్తీర్ణం, వైర్ల కత్తిరింపు..**

రోడ్డు ప్రమాదాలు, చెయిన్ స్నాచింగ్‌లు, దాడులు, హత్యోదంతాలు ఇతరత్రా కేసుల్లో నేరస్తులను పట్టుకునేందుకు సీసీటీవీ కెమెరాలు కీలకం. కేసుల దర్యాప్తు, పోలీసుల పరిశోధనకు ఆయువుపట్టు లాంటి కెమెరాల నిర్వహణపై నిర్లక్ష్యం అలుముకుంటోంది. వార్షిక నిర్వహణ సరిగా లేక, విద్యుత్ స్తంభాలపై ఉన్న అక్రమ తీగలను తొలగించే సమయంలో సీసీటీవీ కెమెరాల వైర్ల తొలగింపు తదితర కారణాలతో కెమెరాలు పనిచేయడం లేదు. దీంతో పోలీసులకు నేరాల దర్యాప్తులో ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2.14 లక్షల సీసీటీవీ కెమెరాలున్నాయి. వీటిలో 'నేను సైతం' కింద 1.87 లక్షల కెమెరాలు, 'నిర్భయ, సేఫ్ సిటీ' ప్రాజెక్టుల కింద 27 వేల కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిలో

..మిగతా 2లో



# తెలంగాణ విద్యార్థులకు యూకే స్కాలర్‌షిప్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భారత బ్రిటీష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ భేటీ

తెలంగాణ విద్యార్థులకు చెవెనింగ్ స్కాలర్‌షిప్స్‌కు బ్రిటన్ అంగీకారం

ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు శిక్షణ ఇచ్చేందుకు సుముఖత

మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆహ్వానం

వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరిన ముఖ్యమంత్రి

సీఎం ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన బ్రిటీష్ హైకమిషనర్

**హైదరాబాద్, ప్రజాస్వరం**

తెలంగాణ విద్యార్థులకు ఉన్నత విద్యను మరింత చేరువ చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఒక ముఖ్యమైన ముందడుగు వేసింది. యూకే ప్రభుత్వం అందించే 'చెవెనింగ్ స్కాలర్‌షిప్స్'ను రాష్ట్రంలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు అందజేయడానికి బ్రిటన్ అంగీకారించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జరిగిన సమావేశంలో భారత బ్రిటీష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ ఈ హామీ ఇచ్చారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. కోఫండింగ్ ప్రాతిపదికన ఈ స్కాలర్‌షిప్స్‌లను అందించడానికి ఆమె సుముఖత వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్రంలో విద్య, అభివృద్ధి, పెట్టుబడులకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో ప్రభుత్వం తీసుకురానున్న నూతన విద్యా విధానం ముసాయిదాను ముఖ్యమంత్రి రేవంత్



రెడ్డి బ్రిటీష్ హైకమిషనర్‌కు వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్ల నైపుణ్యాలను మెరుగుపరిచడానికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. దీనికి లిండీ కామెరాన్ సానుకూలంగా స్పందించారు. అనంతరం, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వం

..మిగతా 2లో


# ₹.600 కోట్ల స్కామ్!



## గేటెడ్ కమ్యూనిటీనే టార్గెట్ చేసిన కిలాడీ లేడీ!

పెట్టుబడుల పేరుతో మోసాలు

ప్రముఖులు, అధికారులే టార్గెట్



**హైదరాబాద్ సెప్టెంబర్ 18(ప్రజాస్వరం):** ఒక మహిళ ఏకంగా కొన్ని వందల మందిని ముంచేసింది. గార్మెంట్ వ్యాపారంలో పెట్టుబడుల పేరు చెప్పి మోసం చేసింది. అదే తరహాలో స్థలాల క్రయ విక్రయాలు అంటూ అక్రమాలు చేసింది. తక్కువ ధరకే భూములు ఇప్పిస్తామంటూ చీటింగ్ చేసింది. ఖాళీ స్థలాలను చూపెట్టి ఏకంగా వందల కోట్లు కొట్టేసింది. ఒక్క గేటెడ్ కమ్యూనిటీలోనే ఒకరికి తెలియకుండా ఒకరి దగ్గర నుంచి 300 కోట్లు కొట్టేసింది. అదే గేటెడ్ కమిటీ ద్వారా పరిచయాలు పెంచుకొని మరో 300 కోట్ల రూపాయలు కొట్టేసింది. మొత్తంగా 600 కోట్ల రూపాయలకు టోకరా వేసింది. ఇంతకీ ఆ కిలాడీ లేడీ ఎవరు?

**పెట్టుబడుల పేరుతో మోసాలు..**

ఆ కిలాడీ లేడీ పేరు.. సంధ్యారాణి. ప్రముఖులు, అధికారులే

..మిగతా 2లో

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్ కలెక్టరేట్ హెల్ప్ లైన్ నెంబర్ 9063423979

జిహెచ్‌ఎంసి హెల్ప్ లైన్ నెంబర్ 040 2111 1111

అన్ని బృందాలు నిరంతరం అందుబాటులో ఉండాలి

హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ సెప్టెంబర్ 18(ప్రజాస్వరం):** హైదరాబాద్ లో మరోసారి భారీ వర్షం కురుస్తుండడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా ఇన్ చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు

..మిగతా 2లో



## బీఆర్ఎస్ అంటే అప్పులు.. కాంగ్రెస్ అంటే అభివృద్ధి

వైరా మున్సిపాలిటీలో పర్యటించిన మంత్రి సీతక్క

బీఆర్ఎస్ తప్పుడు ప్రచారంపై తీవ్ర విమర్శలు

పేదలకు ఇళ్లు, మహిళలకు సంక్షేమ పథకాలు అమలు

స్థానిక ఎన్నికలకు బీసీ రిజర్వేషన్లపై కేంద్రానికి విజ్ఞప్తి

2



## ఆత్మగౌరవమే కోల్పోయాక పదవెందుకు

అది కోల్పోతే పదవి గడ్డి పోచతో సమానం

20 ఏండ్లకు నాలుగు సార్లు ఎమ్మెల్యేలవుతారు..

కానీ నేను ఆరు సార్లు అయ్యాను

ఎంపీ ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు

2

# బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తా



కేటీఆర్‌కి పొంగలేటి సవాల్!

కేటీఆర్ ఇష్టం వచ్చినట్టుగా కాంగ్రెస్ పార్టీపై మాట్లాడుతున్నాడు

జూబ్లీహిల్స్ ఎన్నికలో బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తా

కేటీఆర్‌కి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్



**హైదరాబాద్ సెప్టెంబర్ 18(ప్రజాస్వరం):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇష్టం వచ్చినట్టుగా కాంగ్రెస్ పార్టీపై మాట్లాడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. ఎప్పటికో మూడున్నర సంవత్సరాల తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల గురించి కాకుండా.. త్వరలో వచ్చే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల గురించి కేటీఆర్ ఆలోచించాలని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్

..మిగతా 2లో



## మనమే నష్టపోతాం

మార్వాడీ హటావో నినాదానికి నేను వ్యతిరేకం!

మనమంతా భారతీయులం అని, భారతీయులంతా ఎక్కడైనా జీవించవచ్చు

అందరికి ఒక్కటే రాజ్యాంగం, ఒక్కటే పాస్ పోర్ట్

2

## ఆత్మగౌరవమే కోల్పోయాక పదవెందుకు

- **ఎంపీ ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు**

**హైదరాబాద్ సెప్టెంబర్ 18(ప్రజాస్వరం):**

ఆత్మగౌరవం కోల్పోయాక ఎంత పెద్ద పదవి వచ్చినా అది గడ్డి పోచతో సమానమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. ఉప్పల్ కాప్రాలో గురువారం నిర్వహించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ఎమ్మెల్యే పదవిని గడ్డి పోచ లెక్క విసిరిపడేశామని గుర్తు చేశారు. సాధారణంగా 20 ఏండ్లలో నాలుగు సార్లు ఎమ్మెల్యేలు అవుతారని, కానీ తాను 6 సార్లు అయ్యానని తెలిపారు. సెల్ఫ్ రెస్పెక్ట్ కోసం రాజీనామాల మీద రాజీనామాలు చేశామన్నారు. అభివృద్ధి కావాలా ఆత్మగౌరవం కావాలా అంటే ముందు కోరుకునేది ఆత్మగౌరవం, స్వయం పాలన అని అన్నారు. తమకు ఆత్మగౌరవం, స్వయం పాలన కావాలని కొట్లాడినట్లు గుర్తు చేశారు. ఇప్పుడు అందరూ అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఎంతోమంది త్యాగ ఫలితమని దాన్ని మరచిపోవద్దని సూచించారు. పిల్లలకు దేశభక్తి నేర్పించాలని, దేశభక్తి, కమిట్‌మెంట్ లేకుంటే కష్టమవుతుందన్నారు. పక్క దేశాల్లో ఏం జరుగుతుందో చూస్తున్నామని వివరించారు. పిల్లలకు వారసత్వంగా అందిచాల్సింది కేవలం ఆస్తులు మాత్రమే కాదని, విలువలు, సంప్రదాయాలు అందించాలని రాజేందర్ సూచించారు. ఈ రోజుల్లో వస్తున్న వార్తలు కలచివేస్తున్నాయని, కన్న తల్లిదండ్రులను, కడుపున పుట్టిన పిల్లలను, సొంత భర్తను చంపుతున్నారన్నారు. వీటి నుంచి కాపాడేది విలువలేనని చెప్పారు. ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, దేశంలో అతి ఎక్కువ పర్యటనలు చేస్తున్న ఎంపీగా ఈటల రాజేందర్‌కు మొదటి స్థానం వస్తుందని కొనియాడారు. ఎంపీ అయిన రోజు నుంచి ఆయన ఇంటిలో ఉన్నది లేదని, ప్రతిరోజు ప్రజల మధ్య ఉంటున్నారన్నారు. అలానే నిధులు కూడా ఇవ్వాలని కోరారు. ఈ ప్రాంతంలో రోడ్లు బాగా ధ్వంసమయ్యాయని, బాగు చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం(దిశ)లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో కలిసి ఈటల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సిటీలో ఉన్న ఇంటర్నెట్ కేబుల్స్ అన్నీ కట్ చేస్తున్నారని, వాస్తవానికి వాటిని సరి చేయాల్సిందేనని, కానీ ఇంటర్నెట్ రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, దీనికి వెంటనే పరిష్కార మార్గం చూపాలన్నారు. కరెంట్ ఇనుప స్తంభాలు తొలగించాలని, ఇండ్లపై ఉన్న వైర్లు మార్పించాలని డిమాండ్ చేశారు. చిన్న వర్షం వస్తే చాలు మహానగరం ముంపునకు గురవుతున్నదని, అలా కాకుండా శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నం చేయాలని కోరారు. కొంతమంది అధికారులు జవాబుదారీతనంతో ఉండడం లేదని, ఫోన్లు కూడా ఎత్తడం లేదని కలెక్టర్‌కు వివరించారు.

## రాజీనామా వార్తలపై కోమటిరెడ్డి క్లారిటీ

- **ప్రచారాన్ని ఖండించిన రాజగోపాల్ రెడ్డి**
- **కొందరు కావాలనే సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని మండిపాటు**

**హైదరాబాద్ సెప్టెంబర్ 18(ప్రజాస్వరం):**



తాను పార్టీ మారుతున్నట్లు, కొత్త రాజకీయ పార్టీ పెట్టబోతున్నట్లు గత కొంతకాలంగా జరుగుతున్న ప్రచారంపై మునుగోడు ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు. ఈ ఊహాగానాలన్నింటినీ ఆయన తీవ్రంగా ఖండించారు. అవన్నీ అవాస్తవాలని, ప్రజలు ఎవరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన, తనపై సోషల్ మీడియాలో కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వంలో మంత్రి పదవి దక్కనందుకే తాను అసంతృప్తితో ఉన్నానని, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పనిచేస్తున్నానని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. "కొంతమంది గిట్టని వ్యక్తులు నా ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే ఇలాంటి కట్టుకథలు ప్రచారం చేస్తున్నారు. నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నట్లు, పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నాను" అని ఆయన తెలిపారు. తమది కాంగ్రెస్ కుటుంబమని, రెండుసార్లు పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచానని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అంటే తనకు ఎంతో అభిమానమని, వారి నాయకత్వంపై పూర్తి విశ్వాసం ఉందని పునరుద్ఘాటించారు. ఇలాంటి నిరాధారమైన ప్రచారాలను నమ్మి గందరగోళానికి గురికావొద్దని తెలంగాణ ప్రజలను కోరారు.

## బీఆర్ఎస్ అంటే అప్పులు..
## కాంగ్రెస్ అంటే అభివృద్ధి

- **వైరా మున్సిపాలిటీలో పర్యటించిన మంత్రి సీతక్క**
- **బీఆర్ఎస్ తప్పుడు ప్రచారంపై తీవ్ర విమర్శలు**
- **పేదలకు ఇళ్లు, మహిళలకు సంక్షేమ పథకాలు అమలు**
- **స్థానిక ఎన్నికలకు బీసీ రిజర్వేషన్లపై కేంద్రానికి విజ్ఞప్తి**
- **యూరియా సరఫరా బాధ్యత కేంద్రానిదేనని స్పష్టీకరణ**
- **పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క**

**హైదరాబాద్ సెప్టెంబర్ 18(ప్రజాస్వరం):**

తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌పై బురద చల్లుతున్నారని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తీవ్రంగా విమర్శించారు. రైతుల సమస్యల విషయంలో కేంద్రం బాధ్యతను పక్కనపెట్టి, రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదని ఆమె హితవు పలికారు. ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీలో పర్యటించిన సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. యూరియా సరఫరా అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆ బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వానిదేనని మంత్రి స్పష్టం చేశారు. అయినప్పటికీ, బీఆర్ఎస్ పార్టీ వాస్తవాలను వక్రీకరించి, రైతులను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపుతోందని ఆమె ఆరోపించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని మంత్రి విమర్శించారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులకు త్వరలోనే మరమ్మతులు చేపడతామని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని, మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీతక్క వివరించారు.ఇక స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆమె కోరారు.



# నిద్దరోయిన నిఘా నేత్రం!

**మొదటిపేజీ తరువాయి**

సుమారు 41 శాతం కెమెరాలు పని చేయడం లేదని అధికారులు గుర్తించారు.

**ప్రత్యేక వ్యవస్థే లేదు..**

సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణ కోసం ప్రభుత్వ పరంగా ఎలాంటి ప్రత్యేక వ్యవస్థే లేకుండాపోయింది. అంతేకాకుండా ప్రత్యేకంగా నిధుల కేటాయింపులూ లేవు. హైవేలతో పాటు నగరాలు పట్టణాల్లోని రోడ్లపై వీటిని ఏర్పాటు చేస్తున్న పోలీసు శాఖ కూడా సొంత నిధులు వినియోగించడం లేదు. సామాజిక బాధ్యతగా కార్పొరేట్ సంస్థలు, ఇతర సంఘాలు, సంస్థలు ఇచ్చే విరాళాలు, నిధులతో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. కెమెరాల ఏర్పాటే కష్టసాధ్యంగా ఉన్న పరిస్థితుల్లో, ఏర్పాటైన కెమెరాల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంటోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాంకేతికంగా ప్రపంచదేశాలతో పోటీ పడుతున్న సైబరాబాద్‌లో కెమెరాలు పని




చేయకపోవడం విచారకరం.

**నిర్వహణ చేయకపోయినా బిల్లుల చెల్లింపు**

మాదాపూర్ జోన్‌లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణ బాధ్యతలను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. సదరు సంస్థ కెమెరాల నిర్వహణ పేలవంగా ఉన్నట్లు గుర్తించిన ఓ ఉన్నతాధికారి ఆ సంస్థ యజమానిని కార్యాలయానికి పిలిపించి ప్రశ్నించారు. రోడ్ల విస్తరణ సమయంలో సుమారు 300 కెమెరాలు ఎటో పోయాయని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఒప్పందంలో కెమెరాలు పోయినా కూడా కొత్తవి ఏర్పాటు చేసే బాధ్యత నిర్వహణ సంస్థదే కదా అని సదరు అధికారి ప్రశ్నించగా.. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు తెలిసింది. పైగా సదరు అధికారి తనను వేధిస్తున్నాడంటూ ఆపై ఉన్నతాధికారులకు, పలుకుబడి ఉన్న వాళ్లతో చెప్పడంతో సదరు అధికారి షాక్‌కు గురయ్యారు. అయితే 2020 నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకూ అదే నిర్వహణ సంస్థకు కెమెరాల నిర్వహణ బిల్లులు పేరిట రూ.5.75 కోట్లు ప్రభుత్వం నుంచి చెల్లించడం గమనార్హం. నిర్లక్ష్యం, నిర్వహణ చేయకపోవడంపై సదరు ఏఎంసీ కంపెనీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సంబంధిత అధికారి లేఖ రాసినట్లు సమాచారం.

# రూ.600 కోట్ల స్కామ్..

**మొదటిపేజీ తరువాయి**



ఆమె టార్గెట్. గార్మెంట్ కంపెనీలో డబ్బులు పెడితే అధిక వడ్డీలొస్తాయని ఎంతో మందిని బురిడీ కొట్టించింది. గేటెడ్ కమ్యూనిటీలో ఉంటూ ఆ కమ్యూనిటీ వాసులని మోసం చేసింది. ఏకంగా కమిటీ వాళ్ల దగ్గర నుంచి పెట్టుబడుల పేరుతో రూ.300 కోట్లు వసూలు చేసింది. గార్మెంట్ రంగంలో అధిక లాభాలు వస్తాయి అని నమ్మించి పెట్టుబడులను ఆకర్షించింది. కమ్యూనిటీలో ఉన్న వాళ్లతో కలిసి ఫ్రెండ్షిప్ చేసి బయట వాళ్ల దగ్గర నుంచి కూడా ఇదే తరహాలో పెట్టుబడులు తీసుకుంది. దాదాపు 600 కోట్ల రూపాయలు వసూలు చేసింది.
ఇక ఈమె చేతిలో మోసపోయిన వైజాగ్‌కు చెందిన దొరైరాజు అనే వ్యక్తి.. హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘరానా మోసం బయటపడింది. సంధ్యారాణిని అదుపులోకి తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సంధ్యారాణిని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. అయితే ఆ సమయంలో కేవలం 150 కోట్ల రూపాయలు మాత్రమేనని తేలింది. ఆ తర్వాత బాధితులు సీసీఎస్‌కు క్యూ కట్టడంతో ఏకంగా 600 కోట్ల రూపాయలు అని బయటపడింది. సీసీఎస్‌లో పోలీసులు సంధ్యారాణిని అరెస్టు చేసి తిరిగి కస్టడీలోకి తీసుకున్నారు. అదే సమయంలో సైబరాబాద్‌లోని ఎకనామిక్ అఫెన్స్ వింగ్‌లో కూడా బాధితులు ఫిర్యాదు చేశారు. అక్కడ కూడా మరో 300 కోట్ల రూపాయల మోసం బయటపడింది...
ఖరీదైన ప్రాంతాలలో ఉన్న ఖాళీ స్థలాలను చూపెట్టి అక్కడ కమర్షియల్ బిల్డింగ్‌లు కడుతున్నామంటూ పెట్టుబడులు పెట్టించింది. ఈ మోసానికి మొత్తంగా గంగాధర్ అనే వ్యక్తి సంధ్యారాణికి పూర్తిస్థాయిలో సహాయం చేశాడు. గంగాధర్, సంధ్యారాణి ఇద్దరు కూడా పార్ట్‌నర్స్. అయితే గంగాధర్ ఎవరితోనైనా పెట్టుబడులు పెట్టించాలంటే ముందుగా తాను సంధ్యారాణి కంపెనీలో పెట్టుబడులు పెట్టానని డబ్బులు వచ్చాయని లాభాలు చూపెట్టేవాడు. సంధ్యారాణి బాధితుల లిస్ట్‌లో ప్రముఖులతో పాటు , మాజీ మున్సిపల్ ఛైర్మన్లు, ఎంతోమంది వస్త్ర వ్యాపారులున్నట్లు తేల్చారు పోలీసులు. ఒకే గేటెడ్ కమ్యూనిటీలో సంధ్యారాణి రూ. 180 కోట్లు కలెక్ట్ చేయడం చూసి అధికారులే అవాక్కవుతున్నారు. అంతేకాదు.. GST, TDS ఇన్‌వాయిస్‌లు మార్చి కస్టమర్లను బురిడీ కొట్టించినట్లు తెలిపారు. మోసం బయటకు రాగానే దుబాయ్ వెళ్లేందుకు ప్లాన్ చేసినట్లు వెల్లడించారు. ఇంటిపేరు మార్చి దుబాయ్ రెసిడెంట్ కార్డు కూడా పొందినట్లు పోలీసులు తేల్చారు. ఒక్కొక్కరి దగ్గర నుంచి కనీసం 5 నుంచి 20 కోట్ల రూపాయలు వసూలు చేసింది. ఇప్పుడు తమ డబ్బులు కావాలంటూ చాలామంది హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు.

# బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తా

**మొదటిపేజీ తరువాయి**



ఎన్నికలో బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తా అంటూ కేటీఆర్‌కి పొంగలేటి సవాల్ విసిరారు. మూడున్నర సంవత్సరాల తర్వాత నువ్వు ఇండియాలో ఉంటావా? లేదా ఫారిన్‌లో ఉంటావా? అంటూ విమర్శలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మీకు ఎన్ని సీట్లు వచ్చాయో.. స్థానిక ఎన్నికల్లో కూడా అంతే సీట్లు వస్తాయని పొంగులేటి వ్యాఖ్యానించారు.ఖమ్మం రూరల్ సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గంలో పొంగులేటి మళ్లీ ఎలా గెలుస్తారో చూద్దాం అని అన్న కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించారు. 'సీఎం రేవంత్ రెడ్డి ఎంత కష్టపడుతున్నారో అందరికీ తెలుసు. అధికారంలో ఉన్నప్పుడు వాళ్లకు కనిపించనిది, వినిపించనిది.. ప్రతిపక్షంలో కనిపిస్తుంది అంటే విడ్డూరం, హాస్యాస్పదంఆ ఉంది. విభజన సమయంలో రాష్ట్రాన్ని ఇచ్చిన ప్రధాన పార్టీ కాంగ్రెస్. నాడు మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల పాలు చేసింది. మా ప్రభుత్వం పేదోళ్లకు సంక్షేమ పథకాలు ఇస్తుంటే కొంతమంది విషం కక్కుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే మీకు కడుపు మంట ఎందుకు?. కమిషన్‌లు వచ్చే కాళేశ్వరం కట్టాలనుకున్నారు కానీ.. పేదోడికి డబుల్ బెడ్ రూమ్, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఎందుకు అనుకోలేదు. పేదోడికి ఇల్లు కట్టించి ఉంటే మీకు నేడు ఈ పరిస్థితి ఉండేది కాదు. పాముకు కోరల్లో మాత్రమే విషం ఉంటే.. మీకు ఒళ్ళంతా విషం ఉంటుంది. రెండు పర్యాయాలు మీకు బుద్ధి చెప్పారు, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా మీకు బుద్ధి చెప్పాలి' అని పొంగులేటి ఫైర్ అయ్యారు. 'మీ కుటుంబ సమస్యను రాష్ట్ర సమస్యగా చిత్రీకరించే యత్నం చేస్తున్నారు. మీ సోదరిమణి (కేటీఆర్‌ను ఉద్దేశించి) సమస్య, మీ బిడ్డ సమస్య (కేసీఆర్‌ను ఉద్దేశించి)ను మా సీఎం రేవంత్ రెడ్డికి అంటగట్టే యత్నం చేస్తున్నారు. మొన్న ట్విట్టర్ టిల్లు ఏదో మాట్లాడుతున్నాడు. మూడున్నర సంవత్సరాల తర్వాత ఎన్నికల గురించి కాదు మాట్లాడేది.. ప్రస్తుతం ఏం జరుగుతుందో తెలుసుకో. మీ పార్టీ శాసన సభ్యులు ఆరోగ్యం బాగాలేక చనిపోయారు, దానికి 15 రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తుంది. మీకు ఉన్న పరిజ్ఞానం, విషన్ గురించి నేను మాట్లాడను. కేటీఆర్.. ముందుగా జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలిచి చూడు. బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తా. మూడున్నర సంవత్సరాల తర్వాత నువ్వు ఇండియాలో ఉంటావా, ఫారిన్ వెళ్తావా చూడాలి. జూబ్లీహిల్స్ ఎన్నిక తర్వాత మీ పార్టీ స్థానం ఏంటో చూడు నాయన ట్విట్టర్ టిల్లు. మీ దయ దాక్ష్యాన్యాలతో ఎవరు బిఫామ్ తీసుకోలేదు. మీ నాయన మూడు సార్లు వచ్చి ముక్కు నేలకు రాసినా ఏమి చేయలేకపోయాడు, నువ్వెంత బచ్చాగాడివి. కాంగ్రెస్ పార్టీ అంటే ఆషామాషీ పార్టీ కాదు, ఇచ్చిన మాట కోసం నిలబడి నెరవేర్చే పార్టీ. ఈ పార్టీలో ఏ ఒక్కరు తప్పు చేయరు. తలకిందులూ పెట్టిన పార్లమెంట్ ఎన్నికల్లో మీకు ఎన్ని సీట్లు వచ్చాయో.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అదే సీట్లు వస్తాయి' అని పొంగులేటి అన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మొదటిపేజీ తరువాయి**

కలగకుండా జీహెచ్ఎంసీ, హైడ్రా, పోలీస్ ,విద్యుత్ వివిధ విభాగాల అధికారులు సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. 3 రోజుల్లో పడాల్సిన వర్షం 30 నిమిషాల్లోనే కుంభవృష్టిగా పడుతుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అత్యసరమైతేనే లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇళ్లలో నుండి బయటకు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఇళ్లలోకి వరద నీరు చేరుతున్న ప్రాంతాల్లో ఎక్కడ ఇబ్బందులు ఉన్న, వెంటనే స్పందించాలని తెలిపారు. మ్యాన్ హోల్ వద్ద జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.
లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు ఎక్కడైనా రోడ్లపై నిలిచి సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే హైదరాబాద్ కలెక్టరేట్ హెల్ప్ లైన్ నెం 9063423979, అలాగే జిహెచ్ఎంసి హెల్ప్ లైన్ నెం. 040 2111 1111 లకు కాల్ చేసి సమస్యలు తెలపాలని, అలాగే అన్ని రకాల ఎమర్జెన్సీ బృందాలు అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు.



# తెలంగాణ విద్యార్థులకు యూకే స్కాలర్‌షిప్

**మొదటిపేజీ తరువాయి**

ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టులో బ్రిటీష్ కంపెనీలు భాగస్వాములు కావాలని ఆయన ఆహ్వానించారు. దీంతోపాటు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జీసీసీ), ఫార్మా, నాలెడ్జ్, అకాడమీ వంటి కీలక రంగాల్లో పెట్టుబడులు పెట్టేడానికి ముందుకు రావాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదనలన్నింటికి బ్రిటీష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ సానుకూలంగా స్పందించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంతో తెలంగాణబ్రిటన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడతాయని భావిస్తున్నారు.

# మనమే నష్టపోతాం..

- **మార్వాడీ హటావో నినాదానికి నేను వ్యతిరేకం!**
- **మనమంతా భారతీయులం అని, భారతీయులంతా ఎక్కడైనా జీవించవచ్చు**
- **అందరికి ఒక్కటే రాజ్యాంగం, ఒక్కటే పాస్ పోర్ట్**

**హైదరాబాద్ సెప్టెంబర్ 18(ప్రజాస్వరం):**



'మార్వాడీ హటావో' నినాదానికి తాను వ్యతిరేకం అని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు తెలిపారు. మనమంతా భారతీయులం అని, భారతీయులంతా ఎక్కడైనా జీవించవచ్చన్నారు. అందరికి ఒక్కటే రాజ్యాంగం, అందరికి ఒక్కటే పాస్ పోర్ట్ అని పేర్కొన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలలో మన తెలంగాణ వారు స్థిర నివాసం ఏర్పుచుకొన్నారని.. హటావో భీజం పెరిగి పెద్దదైతే మనమే నష్ట పోతామని, అభివృద్ధి కుంటు పడుతుందన్నారు. ఈ వివాదం ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేదు అని మైనంపల్లి చెప్పుకొచ్చారు.
'విదేశాలలో మన భారతీయులు ఎన్నో ఉన్నత పదవులు ఉన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మినీ ఇండియా. వివిధ రాష్ట్రాలలో మన తెలంగాణ వారు స్థిర నివాసం ఏర్పచుకొన్నారు. మార్వాడీ హటావో భీజం పెరిగి పెద్దదైతే మనమే నష్టపోతాము, అభివృద్ధి కుంటు పడుతుంది. కులాల వారిగా, మతాల వారిగా విడిపోతే నష్టపోయేది మనమే. నీవు, నేను కలిస్తేనే మనం. మనం మనం కలిస్తే జనం. ఎక్కడో జరిగిన పొరపాటు ఇక్కడ రుద్దడం సరికాదు. తప్పు చేసిన వారు శిక్షార్హులు. అందరు కలసి సమైక్యంగా కలిసి ఉందాం. మన అందరి పిల్లలు విదేశాలలో ఉన్నారు కదా?, అక్కడ నుండి వెల్లకొడితే ఎలా?. ఇది నా వ్యక్తి గత అభిప్రాయం' అని మైనంపల్లి హనుమంత్ రావ్ అన్నారు.

# ఆశ్లేష ప్రైవేట్ ఐటిఐలో స్నాతకోత్సవ వేడుకలు



**శామీర్‌పేట, సెప్టెంబర్ 18 (ప్రజాస్వరం) :**

ఆశ్లేష ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో గురువారం 2023-25 బ్యాచ్ సర్టిఫికేటు స్నాతకోత్సవం ఆలియాబాద్ చౌరస్తా వద్ద కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీరం వేంకటరమణ తెలంగాణ మోడల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు హాజరు అయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఈ సమాజంలో అతిచిన్న వయసులో స్థిరపడాలంటే పదవ తరగతి ఉత్తీర్ణులు కాగానే ఐటీఐ చదివి మంచి ప్రావీణ్యతగడించి జీవితంలో స్థిరపడవచ్చునని తెలిపారు. శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంటు విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఇంతటితో చదువు ఆపకుండా స్కిల్స్ నేర్చుకుని పరిశ్రమలలో ప్రావీణ్యత పొంది జీవితాన్ని విజయవంతం చేసుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులను అనుసరించుకుంటూ ముందుకు నడవాలని రవికుమార్ తెలిపారు. మంచి ప్రావీణ్యతపొంది ఐటీఐ సెక్టార్లో, వివిధ పరిశ్రమలలో అప్రెంటిస్షిప్ కొరకు ప్రయత్నించి తప్పకుండా సంవత్సరం వృథాకాకుండా వారి వారి విధానాల ప్రకారంగా చేసుకోవాలని కరుణకుమార్ కంపెనీ హెచ్ఆర్ తెలిపారు. ఐటిఐ ప్రిన్సిపాల్ దామోదర్ మాట్లాడుతూ ఐటిఐతో పాటు బ్రిడ్జి కోర్సు వ్రాసి పాలిటెక్నిక్ లో ద్వితీయ సంవత్సరం అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. ఈ సంవత్సరం వృధా కాకుండా మన శామీర్ పేట, తుర్కపల్లి పారిశ్రామికవాడల్లో ఉద్యోగాలు పొందవచ్చని అన్నారు.

# గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు





**శామీర్‌పేట, సెప్టెంబర్ 18 (ప్రజాస్వరం) :**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు కళాశాల శామీర్ పేటలో గురువారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పాటలు పాడుతూ లయబద్ధంగా చప్పట్లు చరుస్తూ విద్యార్థులు కళాశాల అధ్యాపక బృందం కళాశాల బతుకమ్మ ఆడారని కళాశాల ప్రిన్సిపల్ డా.ఇష్రత్ తెలియజేశారు. తెలంగాణ పండగ బతుకమ్మ ఆడడం పట్ల ప్రిన్సిపల్ హర్షం వ్యక్తం చేశారు. బతుకమ్మ ఆటలో ఉన్న లయను బతుకమ్మ పాటలో ఉన్న గొప్పతనాన్ని కళాశాల కల్చరల్ కోఆర్డినేటర్ జి ధనవేణి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.ఇష్రత్, వైస్ ప్రిన్సిపల్ డా.చేతన అకాడమిక్ వైస్ ప్రిన్సిపల్ డా.స్రవంతి, కల్చరల్ కోఆర్డినేటర్స్ జి.ధనవేణి, అమ్తుల్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



# తహసీల్దార్‌కు శుభాకాంక్షల వెల్లువ

**శామీర్ పేట సెప్టెంబర్ 18(ప్రజాస్వరం) :**

శామీర్‌పేట్ తహసీల్దార్ యాదగిరి రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, కాంగ్రెస్ నాయకులు ఆలియాబాద్ మాజీ సర్పంచ్ కంఠం.క్రిష్ణా రెడ్డి, సీనియర్ ఉద్యమకారులు కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్, మహ్మద్ నిసార్ అహ్మద్ ఖాన్, నర్సింహా రెడ్డి ఆయన ఛాంబర్ లో శాలువా కప్పి సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఇలాగే మరెన్నో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని, క్రమశిక్షణతో పని చేస్తు అనతి కాలంలోనే మంచి పేరు తెచ్చుకున్న తహాసిల్దార్ యాదగిరి రెడ్డికి తప్పకుండా దేవుని ఆశీస్సులు సదా ఉంటాయని తెలిపారు.



# మునీరాబాద్‌ను మోడల్ వార్డుగా అభివృద్ధి చేస్తా

- కమిషనర్ వెంకటగోపాల్

**మేడ్చల్, (ప్రజాస్వరం) :**

గ్రామంలోని అఖిల లపక్ష నాయకులు సహకరిస్తే మునీరాబాద్ ను మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతానని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మునీరాబాద్ తాజా మాజీ సర్పంచ్ గణేష్ నేత చిట్టిమిల్ల,మాజీ ఉపసర్పంచ్ నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బలరాంరెడ్డిలు కమిషనర్ గారితో ప్రత్యేకంగా సమావేశమై మునీరాబాద్ గ్రామపంచాయతీ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో విలీనమైన తరువాత అనేక సమస్యలకు నెలవుగా మారిందని,వాటిని పరిష్కరించాలని కోరారు. వెంటనే స్పందించిన మున్సిపల్ కమిషనర్ గురువారం ఉదయం మార్నింగ్ వాక్ కు వచ్చి మాజీ సర్పంచులు, అఖిలపక్ష నాయకులతో కలిసి గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. మునీరాబాద్ గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఒక వెలుగు వెలిగిన వైకుంఠధామం, డంపింగ్ యార్డ్, పార్క్,నర్సరీ,క్రీడా ప్రాంగణాలు గత సంవత్సర కాలంగా పట్టించుకునే వారు లేక నిర్లక్ష్యానికి గురవుతున్నాయని వాటిని పునరుద్ధరించి ప్రజా ఉపయోగంలోకి తీసుకురావాలని నాయకులు కమిషనర్ ని కోరారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాలనీ అంతర్గత భూగర్భ మోరీల అవుట్ లెట్ ను జనావాసాలకు దూరంగా మార్చాలని, వైకుంఠధామం చుట్టూరా ప్రహరి గోడ నిర్మించాలని, పార్కులోని రోడ్లను, క్రీడా ప్రాంగణాన్ని శుభ్రపరచాలని,వాటి పర్యవేక్షణ కొరకు ఒక వ్యక్తిని నియమించాలని అఖిల పక్ష నాయకులు కోరారు. సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ వీలైనంత తొందరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అఖిల పక్ష నాయకులు గ్రామ అభివృద్ధి కొరకు పార్టీలకతీతంగా సమిష్టిగా ఉండడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కైరంకొండ గణేష్, గూడూరు శ్రీనాథ్ రెడ్డిలు, మాజీ వార్డు సభ్యులు నాగరాజు రెడ్డి నరేందర్లు, డి ఈ దుర్గా ప్రసాద్, మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్,వార్డ్ ఆఫీసర్ అశ్వంత్, మధు, మహేష్, రామకృష్ణారెడ్డి, బిక్షపతి,భాస్కర్ రెడ్డి మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# దేవీ సింగ్ సాహసాన్ని ప్రశంసించిన ఎస్పీ

- జాతీయ స్థాయికి నామినేషన్ చేయాలని అధికారులకు సూచన

**మెదక్, సెప్టెంబర్ 18 (ప్రజా స్వరం) :**

గత కొన్ని రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల వల్ల మెదక్ జిల్లా రాజ్ పేట్ బ్రిడ్జి పై దాదాపు 10 మంది చిక్కుకుపోవడంతో ఈ విషయం తండా కు చెందిన దేవి సింగ్ అనే యువకుడు, గ్రామ మాజీ సర్పంచ్ కిషన్ ప్రోత్సాహంతో ధైర్యంగా చిక్కుకున్న వారిని శ్రమించి వారందరినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చాడు. తన ప్రాణాలను పణంగా పెట్టి 10 మంది ని రక్షించిన దేవి సింగ్ ధైర్య సాహసాన్ని గుర్తించి జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు జిల్లా పోలీస్ కార్యాలయంలో దేవి సింగ్ ను, ఆయన తండ్రి దనూజ ని, రాజ్ పేట్ తండా మాజీ సర్పంచ్ కిషన్ ని ఘనంగా సన్మానించి ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ "మానవ సేవే మాధవ సేవ" అని ప్రతి ఒక్కరు ఇతరులకు సహాయం చేయాలని ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఒకరికొకరు సహాయపడాలని తెలిపారు. పోలీస్ ఎన్డీఆర్ఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఫైర్ డిపార్టుమెంట్ లు ఇటీవల సంభవించిన వర్షాలకు వరదలలో చిక్కుకుపోయిన 350 ప్రజల్ని కాపాడారని తెలిపారు. దేవీ సింగ్ పేరు ను జాతీయ స్థాయిలో ధైర్య సాహసలకు అందించే పురస్కరలకు సైతం నామినేషన్ వేసే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, రూరల్ సీఐ రాజ శేఖర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



# భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- జిల్లా కలెక్టర్ మను చౌదరి

**శామీర్‌పేట, సెప్టెంబర్ 18 (ప్రజాస్వరం) :**

తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అఫ్లేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కం కాలేజ్ గర్ల్స్ భవన నిర్మాణం పనులు ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. గురువారం మేడ్చల్ మండలంలోని సోమరం గ్రామంలో నిర్మిస్తున్న తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అఫ్లేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ జూనియర్ కాలేజ్ భవన నిర్మాణాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు ఎంతవరకు పూర్తయ్యాయని ఇంకా ఎన్ని రోజులలో పూర్తవుతుందని ఏ ఏ పనులు పెండింగ్లో ఉన్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాధాన్యత క్రమంలో అత్యవసరమైన నిర్మాణాలను ముందుగా పూర్తి చేయాలని సూచించారు. డార్మెంటరీ తరగతి గదులు, కిచెన్ టాయిలెట్స్ వంటి వాటిని ముందుగా పూర్తి చేసుకుని వినియోగించుకోవాలని ఆదేశించారు. బోడుప్పల్ లో ప్రైవేటు బిల్డింగ్ లో నిర్వహిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను దసరా సెలవుల లోపు తరలించాలని ఆర్సిఓను ఆదేశించారు. నిర్మాణ పనులను చేపట్టాలని అత్యవసరమైన వాటిని ముందుగా పూర్తి చేసుకుని భవనాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. మొత్తము ఎంత మంది విద్యార్థులు ఉన్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదనంగా అవసరమైన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మార్వో భూపాల్, ఆర్సిఓ నాగార్జున, ప్రిన్సిపల్ మమత పాల్గొన్నారు.





# ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

**వికారాబాద్, సెప్టెంబర్ 18 (ప్రజా స్వరం) :**
రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి గురు వారం వికారాబాద్ జిల్లా కల్లెక్టరేట్ కార్యాలయానికి రావడంతో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ముందుగా పోలీస్ వారి చే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరము జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణ లో ఉన్న ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ ప్రతీక్ జైన్ , జిల్లా ఎస్పి నారాయణ రెడ్డి , అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ల తో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు ను తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అయన సూచించారు. సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల వారితో మాట్లాడారు. బి ఎల్ ఓ ల పేర్లు ఇచ్చారా? , ఓటరు జాబితా పూర్తి అయినదా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ఈ కార్యక్రమములో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డి ఆర్ ఓ మంగీలాల్ ,ఆర్ డి ఓ వాసు చంద్ర, తహసిల్దార్ లక్ష్మి నారాయణ ,ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హాలీ, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతి నిధులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.





# సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐకి సమయానికి అందజేయాలి

## • జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



**వికారాబాద్, సెప్టెంబర్ 18(ప్రజా స్వరం):**
యాసంగి 202425 సీజన్‌కు సంబంధించి బకాయిలో ఉన్న కస్టమ్ మిల్లింగ్ బియ్యం (సీ ఎం ఆర్)ను మిల్లర్లు తక్షణమే పూర్తిగా అందజేయాలని, అలాగే ఖరీఫ్ మరియు రబీ సీజన్లకు సంబంధించిన బియ్యం డెలివరీలను వేగవంతం చేయాలని రెవిన్యూ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. గురు వారం తన చాంబర్‌లో నిర్వహించిన రైస్ మిల్లర్ల జిల్లా సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లర్లు తమ మిల్లు సామర్థ్యం మేరకు సీ ఎం ఆర్ ఎఫ్‌సీఐకి సమయానికి అందజేయాలని కోరారు. అలాగే మిల్లర్లు తమకు అప్పగించిన ధాన్యం పరిమాణానికి తగినట్టుగా బియ్యం సరఫరా చేసుకోవాలని, తమ బాధ్యతగా భావించాలని ఆయన మిల్లర్లకు సూచించారు. బ్యాంకు గ్యారంటీ లేకుండా ప్యాడి ఇవ్వడానికి వీలు లేదని, తప్పనిసరిగా బ్యాంక్ గ్యారంటీ ఉండాలన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా, గ్యాప్ ఎక్కడ కూడా లేకుండా చూడాలన్నారు. ఎఫ్‌సీఐ అధికారులు డెలివరీలకు అనుగుణంగా తగిన సంఖ్యలో గోదాములను ఏర్పాటు చేసి, జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని పేర్కొన్నారు. గోదాముల్లో సరైన తరలింపు కోసం తగినంత మంది హమాలీలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆయన కోరారు. జిల్లాలో స్థల కొరత ఉండకుండా గోదామును ప్రత్యామ్నాయంగా వినియోగించేందుకు ఎఫ్‌సీఐ చర్యలు తీసుకోవాలని, అలాగే బియ్యం నిల్వ మరియు రవాణా సులభతరం చేసేందుకు రైల్వే వ్యాగన్ ల కేటాయింపు పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో ,జిల్లా పౌర సరఫరాల మేనేజర్ మోహన్ కృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి సుదర్శన్ ,శ్రీనివాస్ గుప్తా, శ్రీధర్ రెడ్డి, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.



# ఆరోగ్య రక్షణే లక్ష్యం



## • ఐసీడీఎస్ సూపర్ వైజర్ గిరిజ

**దౌల్తాబాద్, సెప్టెంబర్18, (ప్రజాస్వరం) :**
పోషకాహారం ఆరోగ్యవంతమైన జీవనానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ గిరిజ అన్నారు.మండల పరిధిలోని ముబారాస్ పూర్ గ్రామంలో రెండవ అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భంలోని శిశువు ఎదుగుదల నుంచి శిశువు జన్మించే వరకు ఆ తరువాత పెరుగుతున్న పిల్లలకు తగినంత పోషకాహారం అందిస్తే ఎంతో మేలు చేకూరుతుందని ఆరోగ్య సమస్యలు తలెత్తవన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాయని చిన్నారులు, గర్భిణులు,బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందజేస్తున్నామన్నారు. అయినప్పటికీ కొన్ని కుటుంబాలు వీటిని అందిపుచ్చుకోవడం లేదు. కొందరు తల్లిదండ్రులు కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా తమ పిల్లలకు పౌష్టికాహారం అందించలేకపోతున్నారు. రోజువారీ కూలీలుగా పనిచేసే కుటుంబాలు పోషణ విషయంలో తగిన శ్రద్ధ చూపడం లేదు. ఇటువంటి కుటుంబాలకు పోషణ మాసోత్సవాల్లో పోషకాహారం అందించనున్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీత, అంగన్వాడి టీచర్ వసంత తదితరులు పాల్గొన్నారు.

# పరిగి జోనల్ లెవెల్ కబడ్డీ క్రీడలకు శ్రీకారం



## • టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**పరిగి, సెప్టెంబర్ 17 (ప్రజాస్వరం) :**
వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని జిల్లా పరిషత్ నెంబర్ వన్ ఉన్నత పాఠశాలలో గురువారం 69వ ఎస్ జి ఎఫ్ పరిగి జోనల్ లెవెల్ అండర్/14 మరియు అండర్/17 బాల, బాలికల కబడ్డీ టోర్నమెంట్ ను పరిగి ఎమ్మెల్యే , డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి విద్యార్థులతో పరిచయం చేసుకొని వారితో కలిసి కబడ్డీ ఆడుతూ వారిని ఉత్సాహపరిచారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, పట్టుదల, జట్టు స్ఫూర్తి, శారీరక ఆరోగ్యం పెంపొందుతాయని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రగతి సాధించేందుకు కావలసిన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.




# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**దౌల్తాబాద్, సెప్టెంబర్ 18( ప్రజాస్వరం) :**
దౌల్తాబాద్ మండలంలోని తిరుమలాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ యాదవ రెడ్డి తండ్రి బాల్ రెడ్డి బుధవారం అనారోగ్యంతో బాధపడుతుంది చెందిన విషయాలు తెలుసుకుని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గురువారం స్వగ్రామైన తిరుమలాపూర్ లో పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు యాదవ రెడ్డి, లింగయ్యపల్లి యాదగిరి కొమర వెంకటరెడ్డి దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.




## నిరుపేద, పేద మహిళలను సంఘాలలో చేర్పించాలి





**వికారాబాద్, సెప్టెంబర్ 17(ప్రజా స్వరం):**
నిరుపేద, పేద మహిళలను మహిళ సంఘాలలో చేర్పించుటకు వంద శాతం పూర్తిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం సమావేశము హాలు నందు మెప్మా సిబ్బంది మరియు రిసోర్స్ పర్సన్స్ కి జిల్లా వ్యాప్తంగా మెప్మా కార్యాక్రమాలపైన ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే చదువు ఉండాలి, అందరు చదువుకోవాలి, మీరు చదువు కుంటూ మీ పిల్లలను కూడా చదివిన్చాలన్నారు. మహిళలు రోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఎస్ ఎల్ ఫ్, టీ ఎల్ ఫ్, మరియు ఎస్ హెచ్ జి ,పీడబ్ల్యుడి సంఘాలను 100 శాతం పూర్తి చేయాలన్నారు. . బ్యాంక్ లింకేజి ఈ సంవత్సరం 800 సంఘాలకు రూ .100 కోట్లు ఇప్పించాలని, సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్రోగ్రాం లో అందరి కిబ్యాంకు లోన్లు ఇప్పించాలన్నారు. లోక కళ్యాణ మేళా ఆక్టోబర్ 2 వ తేది లోపు పూర్తి చేయాలి .లోన్ భీమా అప్లీకేషన్స్ అన్లైనో పూర్తి చేయాలి . అమ్రుత్ మిత్ర చెట్లు నాటే కార్యాక్రమంలో మహళలు పాల్గొని చేట్లు నాటాలన్నారు.జిల్లా లో నిరాశ్రయులకు నిర్మించిన షెల్టర్ను వుపయొగంలోకి తీసుకురావాలి , మహిళ సభ్యుల ఉత్పత్తులను మరియు వీది విక్రయదారులను అభివ్రుద్ధిలోకి తీసుకు రావాలన్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ డిస్ట్రిక్ మిషన్ కోఆర్డినేటర్ రవి కుమార్ , టి.ఎం.సి.వెంకటేష్ తాండూరు టి.ఎం.సి శ్ఎన్.రాజేంద్ర ప్రసాద్ ,నాలుగు మున్సిపాలిటీ (వికారాబాద్, తాండూరు, పరిగి , కొడంగల్) లకు సంబంధించిన మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు




**శామీర్‌పేట, సెప్టెంబర్ 18 (ప్రజాస్వరం) :**
తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని పోతాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలందించిన కుమార్ ప్రమోషన్‌పై బదిలీ కావడంతో ఆయనకు గురువారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మెడ్చల్ మల్కాజిగిరి జిల్ల ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, మండల విద్యాధికారి కమలాకర్ హాజరై ఉపాధ్యాయుడు కుమార్ ను శాలువాలతో సత్కరించినారు. బిమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో కుమార్ చూపిన నిబద్ధత విద్యార్థులకు, సహచర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచిందని. వచ్చిన ప్రమోషన్ ఎంతో గౌరవదాయకం పేర్కొన్నారు. కొత్త బాధ్యతల్లో కూడా విజయవంతంగా ముందుకు సాగాలని కోరుతూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని తమ అభిమాన ఉపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.

## విద్యా, వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట

### పరిగి ఎమ్మెల్యే రామమోహన్ రెడ్డి

**పరిగి, సెప్టెంబర్ 18(ప్రజా స్వరం):**
పరిగి ప్రభుత్వ హాస్పిటల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే పరిగి ప్రభుత్వ హాస్పిటల్‌లో తెలంగాణ ప్రభుత్వం, టీ ఆర్ ఆర్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత మెగా వైద్య శిబిరం (స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ మెగా ఆరోగ్య శిబిరం) ప్రారంభమైంది.న్ఈ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే & డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్థానిక నాయకులు,ప్రజాప్రతినిధులతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా హాస్పిటల్‌లోని వార్డులన్నీ సందర్శించిన ఎమ్మెల్యే పేషెంట్లను పలకరించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల నుండి చికిత్సా విధానాలపై వివరాలు తీసుకున్నారు.

# కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

- **మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ యాదవ్**

**శామీర్‌పేట, సెప్టెంబర్ 18 (ప్రజాస్వరం) :**
తూముకుంట మున్సిపాలిటీ ఏడవ వార్డులోనీ ఆర్టీసీ కాలనీలోని సమస్యలను పరిష్కరించడం కోసం మున్సిపాలిటీ డిఈ సునీత, మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ కాలనీవాసులతో కలసి. గురువారం కాలనీలలో నెలకొన్న సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఆర్టీసీ కాలనీ నుండి అయ్యప్ప టెంపుల్ వరకు, మల్లన్న టెంపుల్ నుండి ద్వారకా పురి కాలనీ వరకు ఉన్న రోడ్డు సమస్యలనీ మున్సిపాలిటీ అధికారులు అతి తొందరలోనే పరిష్కరిస్తామని డిఈ సునీత తెలిపారని మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.





# సమన్వయంతో రిపోర్ట్ తయారు చేయాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్**



**వికారాబాద్, సెప్టెంబర్ 18( ప్రజా స్వరం):**
సంబంధిత శాఖల సమన్వయంతో జిల్లా సర్వే నివేదిక రిపోర్ట్ తయారు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్సు హాలు నందు సంబంధింత శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో చిన్న తరహ ఖనిజాలు మరియు ఇసుక పర్యావరణ అనుమతి ఇవ్వటం కోసము సుప్రీం కోర్ట్ ఆర్డర్స్ మేరకు మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్ మెంట్ కేంద్ర అటవీ శాఖ వాతావరణ మంత్రిత్వ శాఖ వారు పర్యావరణ అనుమతులు ఇచ్చే ముందు జిల్లా సర్వే నివేదికనుసమర్పించాలని తెలిపారు. ఈ జిల్లా సర్వే నివేదికను ఆదారంగా చేసుకొని స్టేట్ ఎన్విరాన్మెంట్ ఎఫెక్ట్ అసెస్మెంట్ అథారిటీ వారు పర్యావరణ అనుమతులను జారి చేస్తారని తెలిపారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు తమ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని నిర్ణీత గడువులోపు సమర్పించాలని ఆదేశించారు. ఆ సమాచారాన్ని క్రోడీకరించి జిల్లా సర్వే నివేదికను రాష్ట్ర కాలుష్య మండలికి అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్ డి ఓ వాసు చంద్ర, జిల్లా మైనింగ్ శాఖ ఏ. డీ. సత్యనారాయణ, ఇరిగేషన్ ఎస్ ఇ సీతారం,. ఇ ఇ పి ఆర్ ఉమేష్ కుమార్,గ్రౌండ్ వాటర్ రవి, టి జి ఏం డి సి శ్రీకాంత్ ఆర్ అండ్ బి శ్రీధర్ రెడ్డి, సి పి ఓ వెంకటేశ్వర్లు సత్యనారాయణ రెడ్డి,,తదితరులు పాల్గొన్నారు.

## సీఎంని కలిసిన ఆవుల రాజిరెడ్డి



**మెదక్ జిల్లా సెప్టెంబర్ 18(ప్రజాస్వరం) :**
గురువారం నాడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు .ఈ సందర్భంగా నర్సాపూర్ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి ముఖ్యమంత్రికి పలు వినతిపత్రాలు అందజేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను ప్రతిపాదించారు. వాటిలో ప్రధానంగా: మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని, అంతారం గ్రామాన్ని కౌడిపల్లి మండలంలో కలపాలని,నర్సాపూర్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసి నిధులు కేటాయించాలని, నియోజకవర్గ కేంద్రంలో కోర్టు భవనం, ఆర్డీఓ, ఎమ్మార్వో, అగ్రికల్చర్ కార్యాలయాలు నిర్మించాలని,కొత్తగా ఏర్పడిన చిలిప్‌చేడ్, మాసాయిపేట మండల కేంద్రాల్లో ఎమ్మార్వో, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్ భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే ఆర్ & బి శాఖ కింద రహదారి విస్తరణకు రూ.156 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. ముఖ్యమైన ప్రతిపాదనలు: పిల్లికొట్యాల్ - చండి (ఎల్దుర్తి మార్గం) రహదారి (కిమీ 5/4 నుండి 25/5 వరకు) రూ.60 కోట్లు పోతంశెట్టిపల్లి - ఎల్దుర్తి - తూప్రాన్ రహదారి (కిమీ 0/0 నుండి 18/5 వరకు) రూ.52 కోట్లు చండి కానుకుంట X రోడ్డు (కిమీ 0/0 నుండి 1/5 మిక్సింగ్ లింక్ రోడ్డు ) - రూ.4 కోట్లు ధర్మసాగర్ - మంగళపర్తి రహదారి (కిమీ 0/0 నుండి 13/250 వరకు) - రూ.40 కోట్లు అదే విధంగా పంచాయతీరాజ్ శాఖ కింద రహదారులు, వంతెనల నిర్మాణానికి రూ.15 కోట్ల నిధులు మంజూరు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. వాటిలో హైదరాబాద్ మెదక్ పిడబ్ల్యుడి రోడ్ నుండి దౌల్తాబాద్ - చిట్కుల్ పిడబ్ల్యుడి రోడ్ (శీలంపల్లి వరకు),కొనంపేట రహదారి అభివృద్ధి ,రాజీపేట్ (తిమ్మాపూర్ - జాజీ తండా మార్గం) వద్ద హెచ్ ఎల్ బి వంతెన నిర్మాణం,ముచ్చర్ల ఎల్లాపూర్ రహదారి అభివృద్ధి,పిల్లికుంట్ల తండా దౌజా తండా రహదారి,సికింద్లాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయం రహదారి,సీతారాంపూర్ హెచ్ఎంబీ, పి డబ్ల్యూ డి రోడ్ రహదారి,గుండ్లపల్లి, మధిరా, నర్సాపూర్ రహదారి,రుస్తుంపేట్ రామచంద్రాపురం రహదారి అభివృద్ధి ప్రతిపాదనలు ఉన్నాయి.అదే విధంగా నర్సాపూర్ నియోజకవర్గంలో హయాంలో ప్రతిపాదించిన పలు రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ అన్ని అభ్యర్థనలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని రాజిరెడ్డి అన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే

**వికారాబాద్, సెప్టెంబర్ 18(ప్రజా స్వరం):** వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండల కేంద్రంలోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్స్ లో గురువారం నవాబ్ పేట్ మండలానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య ఘనంగా సత్కరించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఉపాధ్యాయులు, నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత గురువులందరిదన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను విద్యా, నైతిక విలువలు చెప్పి మంచి పౌరులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ప్రతి గురువు బాధ్యతతో పని చేయాలని సూచించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేసి, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.











## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించాలి

- **ఉత్తర్వులను జారీ చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్**

**శామీర్‌పేట, సెప్టెంబరు 18 (ప్రజాస్వరం) :** శామీర్ పేట గ్రామంలో ఉన్న ప్రభుత్వ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శామీర్పేట మండల పరిషత్ హాల్ భవనంలోకి తరలించి ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ మేడ్చల్ జిల్లా కలెక్టర్ కు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ ఉత్తర్వు కాఫీని గురువారం మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలుయాదవ్, మార్కెట్ డైరెక్టర్ తుంకి భిక్షపతి, శామీర్ పేట మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, పొన్నాల గ్రామ మాజీ ఉపసర్పంచ్ గడ్డం రమేష్, మేడ్చల్ ఏబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్ రెడ్డి, ఉరడి వెంకటేష్ కాంగ్రెస్ తదితర నాయకులు జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డినీ కలసి అందజేశారు.

## ఇల్లాలు ఆరోగ్యం ఉంటే కుటుంబం బాగుంటుంది

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 18(ప్రజాస్వరం) :** మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని రాయపోల్ వైద్యాధికారి డాక్టర్ మహారాజ్ అన్నారు. గురువారం రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థి నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రోగ్రాం అధికారి డా. ఆనంద్, గజ్వేల్ డివిజన్ అధికారి డా. శ్రీనివాస్ పర్యవేక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మహిళలు, శిశువుల ఆరోగ్యం కోసం స్వస్థి నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. మహిళలు శిశువులు సమతుల పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటే ఆ కుటుంబం, సమాజం అంతా ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. మహిళలు చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యం కోసం వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో కళ్ళు, చెవులు, ముక్కు, గొంతు , చర్మం,ఇతర సమస్యలు వంటి రోగాలకు ఆయా విభాగాల డాక్టర్లు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డా. ప్రవీణ్, డా. రవితేజ, డా. వినీల, డా. ఫాతిమా, డా. శ్రావణి, డా. రచిత, డా. శివకుమార్, డా. స్టెన్లీ, డా. సారా ఫిరదోస్, హెచ్ ఈఓ శ్రీనివాస్, సిబ్బంది వినోద, మంజు, నీరజ, మోహన్ రావు,ప్రవీణ్, లింగం, మంజుల, భాగ్య, ప్రేమ, మాధవి ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



## డోకిశీల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏం జరుగుతుంది



**మన్యం జిల్లా, సెప్టెంబర్ 18 (ప్రజాస్వరం )** వార్డెన్లు మారుతున్నప్పటికీ డోకిశీల గిరిజన ఆశ్రమ పాఠశాల తీరు ఎందుకు మారడం లేదు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి కుమార్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలే కావస్తున్న డోకిశీల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఇప్పటికే ముగ్గురు వార్డెన్లు మార్పు.ఇంతమంది వార్డెన్లు మారిన గిరిజన విద్యార్థుల కష్టాలు ఎందుకు మారడం లేదు.ఇంతమంది వార్డెన్లు మారుతున్నారు అంటే,ఇది సంబంధిత అధికారుల నిర్లక్ష్యమా..లేదా రాజకీయ కోణమా అని ప్రశ్నించారు. ఒకవేళ గిరిజన విద్యార్థుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యంగా ఉన్న వారిపై ఇంతవరకు చర్యలేవి.అక్కడ బోధిస్తున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు అని వస్తున్న కథనాలకు సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అనేక గిరిజన ఆశ్రమ పాఠశాలలో మెనూ సక్రమంగా అమలు జరగడం లేదని పలు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి అన్నారు. తప్పుడు ఎటినన్స్ కూడా వేస్తున్నారని,వీటిపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజన విద్యార్థుల కోసం ప్రభుత్వం కోట్లు రూపాయలు వెచ్చించినప్పటికీ, విద్యార్థులకు సక్రమంగా ఫలాలు అందడం లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించాలని కోరారు.

## అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలి

**దౌల్తాబాద్, సెప్టెంబర్ 18 ప్రజాస్వరం :** మండల పరిధిలోని లింగరాజుపల్లి గ్రామానికి చెందిన చాలా మంది రైతులు పోతుల స్వామి ఇమ్మిడిశెట్టి నర్సింలు మొక్కజొన్న పంట అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయింది.ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పొలాల్లో నీరు నిలిచి పంటలు మక్కజొన్న కంకలకు మొల్కవచ్చింది పంట మొత్తం కింద పడి కూలిపోయింది రైతులు నష్టాన్ని చవిచూస్తున్నారు. పంట కోతకు సిద్ధంగా ఉన్న సమయంలోనే వర్షం కారణంగా రైతుల కష్టాలు వృధా కావడంతో ఆర్థికంగా



ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రైతులు ప్రభుత్వ సహాయం అందించాలని కోరుతున్నారు

## మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- **ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్**




**మన్యం జిల్లా, సెప్టెంబర్ 18 ( ప్రజాస్వరం ) :** మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మరియు సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. గురువారంసిఐటియు అనుబంధ సంఘం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పార్వతీపురం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ ఇన్స్పెక్టర్ పకీరునాయుడుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా, పట్టణ అధ్యక్షులు సిహెచ్ సింహాచలం, ఎన్.శంకర్రావు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం కార్మికుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తుందని, గత ప్రతిపక్షంలో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, నేడు పూర్తిగా దానిని విస్మరించాలని పేర్కొన్నారు. 12వ పి.ఆర్.సిని వెంటనే ప్రకటించాలని, మున్సిపల్ కార్మికులందరికీ పిఆర్సి జీతాలు చెల్లించాలని, గత జులై సమ్మె కాలం జీతం వెంటనే చెల్లించాలని, 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు జారీ చేయాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని, మరణించిన, అనారోగ్యం, రిటైర్మెంట్ అయిన వారి స్థానంలో కుటుంబ పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఎన్.ఎం.ఆర్ బదిలీ కోవిడ్ క్లాప్ డ్రైవర్లకు రు. 21000/ జీతం చెల్లించాలని, పర్మినెంట్ కార్మికులకు డిఏ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని, పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. పై సమస్యలపై పలుమార్లు మున్సిపల్ ఉన్నత అధికారులకు, జిల్లా కలక్టరుకు విన్నవించుకోవడం జరిగిందని, ఆయన సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వ చర్యలు లేవని తెలిపారు. కావున, ఇకనైనా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రెడ్డి వేణు, పట్టణ నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్, ఫెడరేషన్ నాయకులు మామిడి శివ, బంగారు రాజేష్, బంగారు రవి, పి.సంతోష్, మామిడి శ్రీను, ఎన్.శివ, పాపమ్మ, ఇప్పలమ్మ, మరియు మున్సిపల్ కార్మికులు, డ్రైవర్లు, క్లాఫ్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999